క్లుప్తంగా

వైభవంగా కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ



కారెంపూడి: నరమాలపాడు గ్రామంలోని శ్రీకోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా సీతాసమేత కోదండరాముని విగ్రహాలకు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయంలో దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. యాగశాలలో పిన్నెల్లి వంశీకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామ ప్రజలంతా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా మహాన్నదాన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు జూలకంటి వీరారెడ్డి, ఆర్కే తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు కిడ్నీ వ్యాధులపై అవగాహన

మాచర్ల: పట్టణంలోని మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో సోమవారం కిడ్నీ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో దయాలసిస్ సెంటర్ ఆధ్వర్యంలో వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉదయం 10గంటలకు ప్రజా ప్రతినిధులతో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కిడ్నీ వ్యాధుల పై అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కిడ్నీ రోగులంతా హాజరు కావాలని తెలిపారు.

స్వచ్ఛందంగా పన్నులు చెల్లించండి

గురజాల: స్వచ్ఛందంగా నగర పంచాయతీ కార్యాలయంలో పన్నులు చెల్లించాలని కమిషనర్ అన్నదాత మోహన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మార్చి 30 నాటికి వంద శాతం పన్ను చెల్లించేలా నగర పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక కౌంటర్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఆస్తి, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను తక్షణమే చెల్లించాలన్నారు. పన్ను బకాయిలు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు

మాచర్ల: పట్టణం, రూరల్ పరిధిలోని వివిధ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులను శనివారం నిర్వహించారు. విద్యుత్ శాఖ డివిజినల్ ఈఈ జె.హరిబాబు, డీఈ రామయ్య ఆధ్వర్యంలో ఉదయం 9గంటల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మధ్యాహ్నం 2గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

దాచేపల్లి: స్థానిక విజయ భాస్కర కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి, చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కంటి వైద్య శిబిరానికి కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఆధార్, రేషన్, ఓటరు, ఆరోగ్య శ్రీకార్డులు తీసుకుని రావాలని పేర్కొన్నారు.

రేపట్నుంచి మహా సభలు

దాచేపల్లి: ఈ నెల 13, 14, 15 తేదీల్లో కడవరికాలపు రక్షణ దిద్దుబాటు మహా సభలు నిర్వహిస్తున్నట్లు షెకెము ప్రార్థన మందిరం పాస్టర్ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. నడికుడిలోని మాచర్ల–గోగులపాడు రోడ్డు వద్ద మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సభల్లో హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ జెబరాజు, మాచర్లకు చెందిన పాస్టర్ ఎర్నెస్ట్ పాల్ ప్రసంగిస్తారని, విశ్వాసులు రావాలని ఆయన కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

పిడుగురాళ్ల: పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు పట్టణ కన్వీనర్ చింతా వెంకటరామారావు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. పార్టీ జెండా ఆవిష్కరిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఆలయం లేని 'అమ్మ'.. సంతానప్రాప్తి నిలయం

- అంగరంగ వైభవంగా నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల
- నేడు, రేపు భారీ ఏర్పాట్లలో నిర్వాహకులు
- ఆకర్షణీయంగా కొలువుదీరనున్న కుంకుమ బండ్లు
- ఎమ్మెల్యే పీఆర్కే, పీవీఆర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు
- అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేక కథనం



శ్రీలక్ష్మి అమ్మవారి మూలవిరాట్

దుర్గి: ఆలయం లేని 'అమ్మ'. సంతాన ప్రాప్తికి నిలయం. పార్వతీదేవి అవతారం. భకుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం మహిమాన్వత నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు. ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులతో పూజలందుకుంటున్న అమ్మవారి తిరునాళ్ల ఆది, సోమవారాల్లో ఘనంగా నిర్వహించనున్నారు.

నందీశ్వరుని నాట్యం.. నవ్విన పార్వతీదేవి

దుర్గి మండలం అడిగొప్పల గ్రామ సమీపంలోని నిదానంపాడులో వెలసిన శ్రీలక్ష్మి అమ్మవారి అవతారాన్ని.. స్థలపురాణం వివరిస్తోంది. ద్వాపర యుగాంతంలో కైలాసంలో పార్వతీపరమేశ్వరుల దర్శనార్థం నారదుడు, నందీశ్వరుని తండ్రి శీలదా మహర్షి విచ్చేస్తారు. నారద మహర్షి ఆది దంపతుల నాట్యం చూడాలని తన కోరికను వ్యక్తపరుస్తాడు. ఈ రోజు నందీశ్వరుడు నాట్యం చేస్తాడని మహాదేవుడు సమాధానం ఇస్తాడు. శివుడి ఆజ్ఞతో నాట్య ఆరంభించిన నందీశ్వరుడుని చూసి పార్వతీదేవి పగలబడి నవ్వుతుంది. చూశావా నీ కుమారుని నాట్యం చూసి.. పార్వతీ దేవి ఎలా నవ్వుతుందో అని నారదముని రెచ్చగొట్టడంతో కోపోద్రిక్తుడైన శీలదా మహర్షి పార్వతీదేవితో తల్లీ ఎందుకు తన పుత్రుని చూసి హేళన చేస్తారని ప్రశ్నిస్తాడు. లయబద్ధంగా లేని నాలుగు కాళ్ల వింత రూపం చేసే నాట్యం చూసి నవ్వొచ్చిందని పార్వతీ దేవి సమాధానం ఇస్తుంది. ఈ వింత ఆకారం గర్భాన మోసిన.. నీ భార్య అసలు మనిషేనా అని అంటూ నవ్వుతుంది. అందుకు శీలదా మహర్షి పరమశివుని భార్య అన్న గర్వంతో మునీశ్వరులను, వారి భార్యలను అవమానిస్తావా అని ఆగ్రహిస్తాడు. భూలోకంలో ఏ శక్తులు లేకుండా మానవ రూపంలో పుట్టి, 12ఏళ్ల వయసులో వివాహం కాకుండా అకాల గర్భం ధరించి, నగుబాటుకు గురై.. నీ ఇంటి వారే నిన్ను అవమానించి అగ్నిలో ఆహుతి చేస్తారని శపిస్తాడు.

శాపం ఫలితం..శ్రీక్ష్మి అమ్మవారిగా..

శీలదా మహర్షి శాపం ఫలితంగా.. నిదానంపాడులోని గ్రామ పెద్ద యాగంటి రామయ్య, సుగుణమ్మ అనే దంపతులు సంతానవ్రతం ఆచరించగా వారికి పార్వతీదేవి 15వ శతాబ్దంలో జన్మించినట్లు పురాణం. నలుగురు అన్నదమ్ములతో అల్లారుముద్దుగా పెరిగిన శ్రీలక్ష్మీ.. తన గోశాలలోని గోవు పంచకం రోజూ స్వీకరించేది. ఒక రోజు ఆంబోతు ఒకటి ఆ గోవును క్రీడించిన అనంతరం శ్రీలక్ష్మీ ఎప్పటిలాగే ఆంబోతు వీర్యకణాలు కలిసిన గో పంచకాన్ని సేవిస్తుంది. దీంతో ఆమె గర్భం దాలుస్తుంది. ఇది తెలిసిన అన్నదమ్ములు గ్రామంలో తమ పరువు, మర్యాదలు పోతాయని.. శీలక్ష్మీని చంపాలని ఆలోచన చేస్తారు. పొలానికి అన్నం తీసుకొచ్చిన శీలక్ష్మీని గడ్డివాము సర్దమని చెప్పి.. ఆమె పైకెక్కిన వెంటనే నిప్పు పెట్టి దహించివేస్తారా.. తాను ఏ పాపం ఎరుగనని ఇలా దహనం చేయటం భావ్యం కాదు అని.. విలపిస్తూ ఆమె అగ్నికి ఆహుతవుతుంది. ఈ క్రమంలో ఆమె గర్భం నాలుగు ముక్కలుగా చీలి శిరస్సు మీద మచ్చతో ఒక కోడెదూడ మరణించి భూమిపై పడిందని, ఈ దృశ్యం చూసిన అన్నలు నేత్రాలు కోల్పోయారని, గోవు కూడా అంబా అని అరచి అగ్నిలోకి దూకి ఆహుతయ్యిందని గాథ. మధ్యాహ్నం 12గంటల సమయంలో భీకర శబ్దంతో భూమి బారెడు వైశాల్యంతో చీలి అమ్మవారి సువర్ణ విగ్రహం వెలిసింది. అప్పటి నుంచి ప్రతి ఆదివారం పసుపు, కుంకుమలతో తనను పూజించాలని అమ్మవారు ఆదేశించినట్లు పురాణ సారాంశం. తనకు ఆలయం కట్టవద్దని, తనను దర్శించిన భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, ఇలవేల్పుగా భక్తులకు అండగా ఉంటానని వివరించినట్లు చెబుతారు.

ఘనంగా ఉత్సవాలు..

పాల్గుణ పౌర్ణమికి దగ్గరగా ఉండే ఆదివారం ప్రతి నంబి ఉత్సవాలు అడిగొప్పలలో ఘనంగా నిర్వహిస్తారు. మొదటిగా తమ పుట్టింటి నుంచి యాగంటి వారి కుంకుమ బండి ఆలయం వద్దకు వస్తుంది. అమ్మవారి ఉత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. సంతానం లేని వారు అమ్మవారిని దర్శిస్తే సంతానం ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. కొత్త వాహనాలకు ఇక్కడ పూజలు చేయిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని నమ్మకం. తిరునాళ్ల సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిల నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కైంకర్యాలు సమర్పిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా కుంకుమ బండ్లు..

అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా అడిగొప్పల, ఓబులేశునిపల్లె, నరమాలపాడు, వివిధ గ్రామాల నుంచి కుంకుమబండ్లు సుమారు 30కి పైగా రానున్నాయి. ఒక్కో బండిని రూ.3 నుంచి 4లక్షల వ్యయంతో గ్రామస్తులు తీర్చిదిద్దుతారు. ఉదయం 10 నుంచి రాత్రి 12గంటల వరకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు ఆకట్టుకోనున్నాయి. మాచర్ల, పిడుగురాళ్ళ డిపోల నుంచి ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటు చేశారు.

బంగారు ఆభరణం బహూకరణ



దుర్గి: నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు గోడవర్తి జయలక్ష్మి కుటుంబ సభ్యులు లక్షన్నర రూపాయల విలువైన బంగారు ఆభరణాన్ని శనివారం బహూకరించారు. అమ్మవారి జాతర సందర్భంగా వారు నగను ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నర్సింహబాబుకు అందజేసినట్లు తెలిపారు. అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి, అమ్మవారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. సిబ్బంది నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ



పిడుగురాళ్లరూరల్: బ్రాహ్మణపల్లి గ్రామంలోని అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రబాత సేవ, ఆరాధన, సేవాకాలం, అగ్ని ప్రతిష్ఠ, తీర్థ ప్రాసదం గోష్ఠి, సాయంత్రం బలిహరణ, విష్ణుసహస్ర నామ పారాయణం, జలాధివాసం తదితర హోమాలు నిర్వహించారు. మొదటి రోజు పూజా కార్యక్రమాల్లో వేలాదిగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బస్టాండ్ స్థలం లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

దాచేపల్లి: దాచేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఖాళీ స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు టెండర్లు ఆహ్వానించామని పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు శనివారం తెలిపారు. దాచేపల్లి ఆర్టీసీ బస్టాండ్ ముందు భాగంలో ఉన్న ఎకరం 52 సెంట్లు(7,357 చదరపు గజాలు) ఖాళీ స్థలాన్ని 15 ఏళ్ల పాటు లీజుకు ఇస్తామని చెప్పారు. ఈ నెల 23లోపు ఆసక్తి కలిగిన వారు టెండర్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 24న టెండర్లు ఫారాలను ఓపెన్ చేస్తామని, పూర్తి వివరాలకు 9959225430 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

'గడప గడపకు'
ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

గురజాల: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోగులపాడు గ్రామంలో శనివారం రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ మాటకు కట్టుబడి ప్రజా సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధే, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగనన్నకు తోడుగా ప్రజలు తరలి రావాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, గోగులపాడు గ్రామ సర్పంచ్ నందేలా రాములమ్మ రామిరెడ్డి, వేలమూరి సైదారెడ్డి, పాశం హనిమిరెడ్డి, షేక్ పీర్ అహ్మద్, ముత్తన బ్రహ్మానందారెడ్డి, మోరసాని రామిరెడ్డి, బి.కోటిరెడ్డి, ఆర్.గురవారెడ్డి, జి.కృష్ణారెడ్డి, సీహెచ్ కాశీరెడ్డి, ఎం.లచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రిక్కల వెంకటేశ్వరరెడ్డి, కనకం ఆదినారాయణ దత్తు, కుక్కమూడి అనిల్‌కుమార్, కె.గిరిబాబు పాల్గొన్నారు.

కత్తెరపు కుటుంబానికి ఎంపీ పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కత్తెరపు వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి శనివారం పిడుగురాళ్ల పట్టణంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. కత్తెరపు వాసుదేవరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకటరామారావు, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భవనాశి యల్లారావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, మద్దాలి సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

నాగిరెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం



మందపాటి నాగిరెడ్డి స్మారక స్థూపం వద్ద నేతల నివాళి

దాచేపల్లి : దివంగత మాజీ ఎమ్మెల్యే మందపాటి నాగిరెడ్డి కాంస్య విగ్రహాన్ని నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్‌లో ఏర్పాటు చేస్తామని నడికుడి మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నాగిరెడ్డి 18వ వర్ధంతి కార్యక్రమాన్ని ఇరికేపల్లిలోని నాగిరెడ్డి స్మారకస్థూపం వద్ద శనివారం నిర్వహించారు. నాగిరెడ్డి చిత్రపటానికి పూలదండలు వేసి, నివాళులర్పించారు. విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా నాగిరెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, ఆయనను ప్రజలు జీవితాంతం గుర్తుపెట్టుకునేలా రూ.10లక్షల వ్యయంతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాలతో నగర పంచాయతీ కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారని, రెండు నెలల వ్యవధిలో విగ్రహం ఏర్పాటు చేసి స్మారక స్థూపం వద్ద స్మృతివనం నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, నియోజకవర్గ కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, నాయకులు బుర్రి కృష్ణారెడ్డి, యడ్ల బాస్కర్, వెంకట్రావ్, రామిరెడ్డి, సరవయ్య, యాకోబు, ఏలియా, గాలిషా, బుర్రి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

దాచేపల్లి: మండలంలోని తక్కెళ్లపాడు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను శనివారం పరిష్కరించారు. కాలనీలో ఉన్న బోరు మరమ్మతులకు గురి కావడంతో.. ఎంపీటీసీ జంగిలి నరసింహారావు, గ్రామ కన్వీనర్ మేడతి నరసింహారావు సొంత ఖర్చులతో కొత్తమోటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ పనులను కాలనీవాసులు వట్టిపు దేవమ్మ, రత్నం, అఖిల్, ఏసు, భార్గవ్ పర్యవేక్షించారు.

బాలస్వామిరెడ్డికి సత్కారం



బాలస్వామిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

మాచర్ల: పట్టణానికి చెందిన వార్డు కౌన్సిలర్ చవ్వా బాలస్వామిరెడ్డిని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా ఎంపిక చేయటం అభినందనీయమని ఏఎంసీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం రైల్వేస్టేషన్ రోడ్డులోని న్యాయవాది నాగిరెడ్డి కార్యాలయంలో మదర్‌థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో బాలస్వామిరెడ్డి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా సమితి సభ్యులు జక్కిరెడ్డి మల్రెడ్డి, జి.కిరీటిరెడ్డి, కసిరెడ్డి శాంతిరెడ్డి, తుమ్మా మల్రెడ్డి, జె.చిన్నపరెడ్డి, బి.నాగిరెడ్డి, కొణతం ఈశ్వరరెడ్డి, ఎస్.భాస్కర్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఎం.పాపిరెడ్డి, బి.జ్ఞాన ప్రకాష్, శ్రీనివాసరావు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

దాచేపల్లి: స్థానిక ముత్యాలంపాడు రోడ్డులోని శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి, అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా కలశ ప్రతిష్ఠ చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి వార్షిక కల్యాణం జరిపించారు. కుంకు మబండ్లు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశాయి. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, నాయకులు అంబటి ఆంజనేయులు, కుందురు తిరుపతిరెడ్డి, కొప్పుల రవి కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

నేడు నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి కల్యాణం

దాచేపల్లి: స్థానిక మాదినపాడు రోడ్డులోని శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం జరుగుతుందని కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి వార్షిక కల్యాణం, పూజ కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

ఏసుక్రీస్తు లోక రక్షకుడు

విజయపురిసౌత్: ఏసుక్రీస్తు లోక రక్షకుడని గ్లోరీ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ రెవరెండ్ డాక్టర్ దానియేలు అన్నారు. శనివారం గ్లోరీ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్‌లో జరిగిన 12గంటల ఉపవాస ప్రార్థనలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ దేశాల క్షేమం కొరకు, పాడిపంటల సంవృద్ధికి ఆయన ప్రార్థించారు. 50 సంఘాల పాస్టర్లు, భక్తుల పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి



పిడుగురాళ్ల: మహిళ అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన పట్టణంలోని కొండమోడు సమీపంలో పంతులుగారి మిల్లు వద్ద శనివారం వెలుగులోకి వచ్చింది. పట్టణ ఎస్‌ఐ పవన్‌కుమార్ కథనం మేరకు.. పట్టణంలోని బాబుజగజ్జీవన్‌రావు కాలనీకి చెందిన మెడతపల్లి కుమారి(55) అనుమానస్పదంగా సున్నపు మిల్లు సమీపంలో మృతి చెంది పడి ఉంది. అక్కడ దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వారు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. పట్టణ వీఆర్వో సత్యనారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలితోపాటు ఆమె భర్త మట్టయ్య రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారి మృతి చెంది సుమారు రెండు రోజులు అయ్యి ఉండవచ్చునని ఎస్‌ఐ తెలిపారు. అనుమానాస్పద మృతికింద కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని శాంతి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవ వైభవంగా నిర్వహించారు. దేవస్థానం 19వ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రధాన అర్చకులు మారుతీశర్మ నేతృత్వంలో వేద పండితులు స్వామివారికి ఉదయం ప్రత్యేకపూజలు, పంచామృతాభిషేకం, సుదర్శన హోమం, పుష్పార్చన నిర్వహించారు. కనుల పండువగా స్వామివారికి శాంతి కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మయ్య బావి సెంటర్ వద్ద లడ్డు వేలం పాట వేశారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దేవస్థానం అధ్యక్షుడు నాళం పెదబాబు, పాలక వర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తమ ఫలితాలకు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం నాగమణి

మాచర్ల: తల్లిదండ్రులు క్రమశిక్షణతో చదివించి పదో తరగతి పరీక్షల్లో తమ పిల్లలు నూరుశాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని హెచ్‌ఎం ఐవీ నాగమణి అన్నారు. పట్టణంలోని రైల్వేగేటు పక్కనున్న జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆరు పేపర్లతో 100 మార్కులకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థినులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఇంట్లో చదువుకునేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఈ అవగాహన సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉషాలత, నాగరాజు, వాణి, దివ్యజ్యోతి, సంపూర్ణ, పాఠశాల చైర్మన్, కమిటీ సభ్యులు మున్ని, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కారెంపూడి: అడిగొప్పల సమీపంలోని నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం కుంకుమ బండ్లు గుడి దగ్గరకు చేరడం కోసం మండలంలోని మిరియాల, లక్ష్మీపురం, నరమాలపాడు గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం రాత్రి 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కుంకుమబండ్లు గుడికి చేరేటప్పుడు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.